పల్లెకు సంక్రాంతి కళ

సంక్రాంతి, కనుమ పర్వదినాలను పురస్కరించుకుని ఖమ్మం, మధిర, పాలేరు, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల ప్రజలు ఘనంగా సంబురాలు నిర్వహించారు. కొత్త అల్లుళ్లు, బంధుమిత్రుల రాకతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొన్నది. యువకులు, చిన్నారులు గాలిపటాలు ఎగుర వేశారు. గ్రామగ్రామాన మహిళలు రంగురంగులతో ముగ్గులు వేసి లోగిళ్లను అందంగా తీర్చిదిద్దారు. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు.. ఎంతో ఆకట్టుకున్నాయి. పలు గ్రామాల్లో క్రీడలు, ముగ్గుల పోటీలు నిర్వహించి నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందజేశారు. కనుమ సందర్భంగా మంగళ వారం రైతులు పశువులను ప్రత్యేకంగా అలంకరించి గోపూజ నిర్వహించారు. ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల్లో కోడిపందేల జోరు కొనసాగింది.

- నమస్తే నెట్‌వర్క్

సత్తుపల్లి: ఎమ్మెల్యే రాగమయిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

కల్లూరులో చేపల మార్కెట్ వద్ద జనం

బోనకల్లు: ముగ్గుల పోటీల్లో విజేతకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

కారేపల్లి: ముగ్గుల పోటీలో మహిళలు

తల్లాడ: కుర్నవల్లిలో ఇంటి ఎదుట వేసిన ముగ్గు

ఖమ్మం నగరంలో ఆడుతున్న పాఠశాల విద్యార్థులు

చింతకాని: క్రికెట్ పోటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

సత్తుపల్లి: సాయిస్ఫూర్తి కాలేజీలో పాలు పొంగిస్తున్న సిబ్బంది

కూసుమంచిలో ముగ్గుల పోటీల సందడి

ఖమ్మం నగరంలో పతంగులు ఎగురవేస్తున్న చిన్నారులు

జిల్లా రవాణా శాఖ అధికారిగా గౌస్‌పాషా

డీటీవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంవీఐ వరప్రసాద్

రఘునాథపాలెం, జనవరి 16: ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారిగా ఎండీ గౌస్ పాషా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ మంగళవారం ఉత్వర్వులు విడుదల చేశారు. ఇక్కడ డీటీవోగా పనిచేసిన తోట కిషన్‌రావుకు ఆయన పూర్వపు స్థానమైన వాంఖేడ్‌లో విధులు కేటాయించారు. కరీంనగర్‌లో సీనియర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గౌస్‌పాషాకు ఖమ్మం డీటీవోగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కాగా, మంగళవారం ఆయన ఖమ్మం డీటీవోగా బాధ్యతలు స్వీకరించారు. నూతన డీటీవోను ఖమ్మం, వైరా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు వరప్రసాద్, శంకర్‌నాయక్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. కాగా, గౌస్ పాషా గతంలో ఖమ్మం జిల్లాలో పలు చోట్ల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

సత్తుపల్లి రూరల్, జనవరి 16 : తాళ్లమడ వద్ద కోడిపందేల స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. గ్రామంలో రైస్‌మిల్లు వెనుక కాలువొడ్డు వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 16 ద్విచక్రవాహనాలు, రూ.20వేల నగదు స్వాధీనం చేసుకుని 8 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్‌బాబు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

సత్తుపల్లి రూరల్, జనవరి 16 : సత్తుపల్లి పట్టణంలోని అయ్యగారిపేట వద్ద ఆటోలో అక్రమంగా తరలిస్తున్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యం సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన వ్యక్తివిగా గుర్తించి సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు సీఐ మోహన్‌బాబు తెలిపారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

వేంసూరు, జనవరి16 : ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. పోలీసులు తెలివివరాల ప్రకారం.. మర్లపాడు గ్రామానికి చెందిన సైదా కుటుంబరావు (54) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మృతుడు భార్యతో గొడవ పడి మనస్థాపానికి గురై ఈ నెల 13న రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు సత్తుపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

గురుకులాల్లో ఇంటర్ కోర్సులకు దరఖాస్తులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 16: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో నిర్వహిస్తున్న ఖమ్మం రీజియన్‌లోని సీవోఈ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీవో ప్రత్యూష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నగరం, దానవాయిగూడెంలోని కళాశాలల్లో బాలికలకు, పాల్వంచ కళాశాలలో బాలురకు అవకాశం ఉందని అన్నారు. ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 20లోగా సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్‌లో సంప్రదించాలని, మొదటి లెవల్ స్క్రీనింగ్ పరీక్ష ఫిబ్రవరి 4న, రెండో లెవల్ స్క్రీనింగ్ పరీక్ష ఫిబ్రవరి 25న నిర్వహించనున్నట్లు చెప్పారు.

వేంకటేశ్వరస్వామికి వెండి బిందె బహూకరణ

స్వామివారికి వెండి బిందెను సమర్పిస్తున్న భక్తులు

మధిర, జనవరి16: మధిర పట్టణంలోని బంజారాకాలనీలో ఉన్న లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు మంగళవారం గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంటిశెట్టి లక్ష్మయ్య, వరలక్ష్మి జ్ఞాపకార్థం వారి మనువడు గంగిశెట్టి మహేష్ స్వామివారికి 750 గ్రాముల వెండి బిందెను కానుకగా సమర్పించారు. ఆలయ అధ్యక్షుడు గుర్రం రామారావు, మల్లాది సవిత, గొండేల ముత్తయ్య, కళ్యాణం పుల్లారావు, అర్చకులు అనంతచార్యులు, విజయ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వారం రోజుల పాటు రైల్వే గేటు మూసివేత

కారేపల్లి, జనవరి 16 : ఇల్లెందు-కారేపల్లి ప్రధాన మార్గంలోని రైల్వే గేటును వారం రోజుల పాటు మూసివేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గేటు మరమ్మతులు కారణంగా వారం రోజులు ఈ మార్గంలో వాహన రాకపోకలకు అనుమతి లేదని పేర్కొన్నారు. ఇల్లెందు వేళ్లవలసిన వాదనదారులు మాదారం,గాంధీపురం రైల్వే గేట్ మార్గంలో వెళ్లాలన్నారు.

అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లిన కారు

ఘటనా స్థలంలో కారు

వైరారూరల్, జనవరి16 : వైరా మండలం విప్పలమడక గ్రామంలో ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ఖమ్మం పట్టణానికి చెందిన యువకులు ఎన్‌టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం కొణిజర్ల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా వైరా మండలం విప్పలమడక గ్రామ సమీపంలో సోమవారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి పంట కాల్వలో పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని కాపాడి పోలీసులకు సమాచారం అందించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

చింతకాని, జనవరి 16: మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మూడు జిల్లాల స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలచిన జట్లకు సోమవారం నిర్వహకులు బహుమతులు అందజేశారు. అగ్రహారం, రామకృష్ణాపురం, పందిళ్లపల్లి జట్లు వరుసగా విజేతలుగా నిలిచాయి.

పెద్దమునగాలలో ముగ్గుల పోటీలు

కొణిజర్ల, జనవరి 16 : సంక్రాంతి పండుగ పురస్కరించుకొని పెద్దమునగాలలో పొంగులేటి అభిమానుల ఆధ్వర్యంలో సర్పంచ్ పరికిపల్లి శ్రీను ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, అంజయ్య, సోల శ్రీను, వెంకటేశ్వర్లు, పరికపల్లి భిక్షం, గన్నారపు వెంకయ్య, అప్పారావు, కృష్ణమూర్తి, జగన్ పాల్గొన్నారు.

'పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి'

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మం, జనవరి 16: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు గ్రాడ్యుయేట్లందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. గత ఎన్నికల్లో ఓటు వేసిన గ్రాడ్యుయేట్లందూ ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు మరోసారి కూడా ఫారం 18 ద్వారా మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియపై ఎలక్టోరల్ అధికారులతో నూతన కలెక్టరేట్ నుంచి మంగళవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్‌లో ఆయన మాట్లాడారు. 2020 నవంబర్ 1కి ముందు డిగ్రీ ఉత్తీర్ణులతోనూ ఫిబ్రవరి 6లోగా పారం 18 ద్వారా తాజాగా దరఖాస్తు చేయించాలని సూచించారు. ఫిబ్రవరి 24న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ ప్రచురణ ఉంటుందని తెలిపారు.

గడువులోగా సీఎంఆర్ డెలివరీ పూర్తి చేయాలి

2022-23 వానకాలం సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ రైస్ డెలివరీని ఈ నెల 31 నాటికి పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (ఏసీ) మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. ఆ గడువులోగా డెలివరీ చేయకుంటే జమానత్ ఉన్న మిల్లర్లపై అగ్రిమెంట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సివిల్ సప్లయిస్ కమిషనర్ ఆదేశాల మేరకు డెలివరీ చేయాల్సిన సీఎంఆర్ రైస్‌పై రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికి అనుగుణంగా డెలివరీ పూర్తి చేయాలని సూచించారు.

మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

మధిర, జనవరి16: మధిర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిఒక్కరూ కాపాడుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. సోమవారం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు నిర్వహించిన ముగ్గుల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతిని మహిళలు ఎంతో ఉత్సాహంగా చేసుకుంటారని, ప్రతి ఇంటి ఎదుట రంగురంగుల ముగ్గులు పరిచి బజారులన్నీ రంగులమయం చేస్తారన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లత, వైస్ చైర్‌పర్సన్ విద్యాలత, కౌన్సిలర్లు యన్నంశెట్టి అప్పారావు, మాధవి, అరిగె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేస్తున్న జడ్పీ చైర్మన్

ప్రజాపాలన కొనసాగుతుంది: డిప్యూటీ సీఎం

బోనకల్లు, జనవరి16: రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సాయిబాబా కల్యాణ మండపం వద్ద పౌర సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చిమ్మపూడిలో పర్యటనలో కేంద్రమంత్రి బీఎల్ వర్మ

మాట్లాడుతున్న కేంద్రమంత్రి బీఎల్ వర్మ

రఘునాథపాలెం, జనవరి 16: అర్హులైన ప్రజలందరూ కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్రమంత్రి బీఎల్ వర్మ సూచించారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా మండలంలోని చిమ్మపూడి గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్రం అమలు చేస్తున్న పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. అనంతరం ఉజ్వల పథకం కింద మంజూరైన గ్యాస్ కనెక్షన్లను పలువురు లబ్ధిదారులకు అందజేశారు. బ్యాంకు అధికారుల ద్వారా స్వయంగా జన్‌ధన్ ఖాతాలను ఓపెన్ చేయించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు పంపిణ చేశారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు విజయకుమారి, డాక్టర్ మాలతి, విద్యాచందన, గుత్తా రవి, గొర్రె కృష్ణవేణి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, గుత్తా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి దాసరి ఫౌండేషన్ సహకారం

తల్లాడ, జనవరి16 : సమాజాభివృద్ధికి దాసరి మెమోరియల్ ఫౌండేషన్ సహకారాన్ని అందిస్తుందని మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎం.రఘునాథబాబు అన్నారు. అన్నారుగూడెం గ్రామానికి చెందిన దాసరి పద్మ స్మారక యువజన సాంస్కృతిక సమాఖ్య, దాసరి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను సీనిదర్శకుడు రేలంగి నరసింహారావుతో కలిసి సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. నిరంతరం దాసరి నారాయణరావు, పద్మ దంపతుల సామాజిక సేవాభావాన్ని కొనసాగించడమే ఫౌండేషన్ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సినీదర్శకుడు రేలంగి నరసింహారావు, అసిస్టెంట్ డైరెక్టర్ అడపాల వెంకటేశ్వరరావు, దాసరి పద్మ, స్మారక యువజన సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు గుమ్మా నరేశ్, సమన్వయ కర్త దుగ్గిదేవర అజయ్‌కుమార్, సోంపల్లిసోంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: బీరోలు పాఠశాలలో పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనాలు

తిరుమలాయపాలెం, జనవరి 16: మండలంలోని బీరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు మంగళవారం కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఈ అపూర్వ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఎక్కడెక్కడో వివిధ వృత్తుల్లో స్థిరపడ్డ స్నేహితులు విద్యనభ్యసించిన పాఠశాలలో ఒకేచోట కలుసుకోవడంతో వారి ఆనందంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు కామేశ్వరావు, బ్రహ్మం, ప్రభాకర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ వంచర్ల అలివేలమ్మ పాల్గొన్నారు.

తల్లాడలో..

తల్లాడ, జనవరి 16 : తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఇక్కడ పాఠశాలలో కలుసుకున్నారు. వివిధ హోదాల్లో ఉన్నవారంతా నాటి జ్ఞాపకాలు నెమరువేసుకుని గురువులను సత్కరించారు.

తల్లాడ: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

యువత క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలి

ఖమ్మం రూరల్, జనవరి 16: యువత క్రీడల పట్ల మక్కువ కలిగి ఉండాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏదులాపురంలో ఈ నెల 13నుంచి 15 వరకు క్రికెట్ పోటీల్లో గెలిచిన వారికి మంగళవారం బహుమతులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, సోమరాజు, పొన్నెకంటి నర్సింహారావు, శేఖర్, ఉమాశంకర్, శ్యాంరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఖమ్మం -1 బ్రాంచ్ వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **బత్తుల రవిబాబు**, వయస్సు : 51 సం॥లు, తండ్రి : **మధుసూదన రావు**, వృత్తి : ప్రైవేటు ఉద్యోగి, నివాసం : ఇ.నెం. 16-7-122/1, మధురానగర్ రోడ్ నెం.15, గొల్లగూడెం రోడ్, ఖానాపురం హవేలి, ఖమ్మం నగరం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నాక్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం రిజిస్ట్రేషన్ జిల్లా, కూసుమంచి సబ్ రిజిస్ట్రారు వారి అధికార పరిధిలోని, ఖమ్మం రెవిన్యూ జిల్లా రఘునాథపాలెం మండల పరిధిలోని, రఘునాథపాలెం, గ్రామ పంచాయితీ పరిధిలోని రఘునాథపాలెం రెవిన్యూ గ్రామ సర్వే నం. 80/ఆ2 మరియు 81/ఆ, మింజుమలే నివేశన ఖాళీ స్థలం ప్లాటు నెం. 422, విస్తీర్ణం : 200-00 చ॥గజములు లేక తత్సమానం : 167-22 చ॥మీ॥, **డాక్యుమెంట్ నెంబర్** : 5547/2021 గల విక్రయాస్తికి హద్దులు : **తూర్పు** : 30-0 అడుగుల వెడల్పు గల రోడ్డు, **పడమర** : ప్లాటు నెం. 400, **ఉత్తరం** : 30-0 అడుగుల వెడల్పుగల రోడ్డు, **దక్షిణము** : ప్లాటు నెం. 421.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

I, **HAJIRA AYESHA SIDDIKHA** (OLD NAME) R/O. H.NO.10-4-45/1, MADINA MASJID LANE, EX-SERVICEMEN COLONY, CHUNCHUPALLI, KOTHAGUDEM, BHADRADRI KOTHAGUDEM DIST, TELANGANA changed my name as **HAJIRA AYESHA SIDDIQUA**, (new name), W/o. MOHAMMAD ISMAIL KHAN. KMM

కావలెను

మన పట్టణంలో కొత్తగా స్థాపించిన బ్రాంచ్ నందు పని చేయుటకు ఇంటర్, డిగ్రీ, బి.టెక్, PG చదివిన అభ్యర్థులు కావలెను. వర్క్ ఫ్రం హోం కలదు. సెల్: 9640248588, 9365043965.
NTW-323057

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616